క్లుప్తంగా

ఘనంగా మాజీ మంత్రి వనిత జన్మదిన వేడుకలు

శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



మాజీ మంత్రి వనితకు పూల బొకేను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ద్వారకాతిరుమల: రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత పుట్టిన రోజు వేడుకలు తాడేపల్లిగూడెంలోని ఆమె నివాసంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ద్వారకా తిరుమల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు పూల బొకేలను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేక్‌లను కట్ చేయించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ద్వారకా తిరుమల పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, రుద్ర శివాజీ, చిలుకూరి చంద్రం, వైఎస్సార్‌సీపీ మండల మహిళాధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, తదితరులున్నారు.

కొండ చిలువ హతం



గ్రామస్తుల చేతిలో హతమైన కొండ చిలువ

టి. నరసాపురం: పుల్లేపులో 12 అడుగుల కొండ చిలువ గ్రామస్తుల చేతిలో హతమయ్యింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు ఇంటి సమీపంలో ఉన్న కోళ్ల గాబులో భారీ కొండ చిలువ ప్రవేశించి కోడి పుంజును మింగేస్తుంది. కోళ్ల అరుపులతో కుటుంబ సభ్యులు చూడగా కొండ చిలువ కనపడింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికుల సాయంతో దానిని హతమార్చారు.

క్రీడాకారిణులకు ఆర్థిక సాయం



క్రీడాకారిణులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ఇటీవల రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల క్రీడాకారిణులు ఏడుగిరికి రిటైర్డ్ హెచ్‌ఎం జల్లా వీరభద్రరావు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. క్రీడల్లో రాణించిన వారు శారీరకంగా, మానసికంగా బలంగా రూపుదిద్దుకుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం జి.సునీత మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు. దాతలు, తల్లిదండ్రులు, శిక్షకుల సహకారంతో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.మురళీకృష్ణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు పరిశీలన

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు గ్రామ పంచాయతీలో (ఎస్‌డబ్ల్యూపీసీ) చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డును డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ జి.ప్రసంగిరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రందే లక్ష్మీ సునీత, కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదర్శ గ్రామంగా తయారు చేయడానికి సహకారం అందించాలని ప్రసంగిరాజును కోరారు. ఈ నేపథ్యంలో వారు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను వివరించారు. ప్రతిరోజు ప్రజల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షెడ్డును, గ్రామాన్ని ప్రసంగిరాజు పరిశీలించారు. గ్రామంలో అమలు చేస్తున్న పారిశుద్ధ్య పనులు, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ఎస్.భూషణం, పంచాయతీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీపీఎఫ్ ఉద్యోగుల ఆందోళన

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. నియామక సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం సీపీఎఫ్ ఉద్యోగులు రాజమండ్రిలోని కంపెనీ గేటు 18వ రోజు ఆందోళన కొనసాగించారు. కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని, కంపెనీని తిరిగి ప్రారంభించాలని వారు నినాదాలు చేశారు. న్యాయం జరిగేవరకూ ఆందోళన కొనసాగిస్తామని ప్రకటించారు.

విజయవంతంగా 'నేను బడికి పోతా'



శ్రీనివాసపురంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్

జంగారెడ్డిగూడెం రూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుల్లో రాణించాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ మంచి ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉపసర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, టీడీపీ నాయకులు దాసరి శేషు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ

టి.నరసాపురం: ప్రతీ విద్యార్థి పాఠశాలకు విధిగా హాజరవ్వాలని కూటమి నాయకులు సూచించారు. మండలంలోని వందరామన్నపాలెం ఎంపీపీ పాఠశాలలో సోమవారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎస్ పవన్‌కుమార్, పి.సురేష్, వై.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

చింతలపూడి: బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మెంబర్ డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, డిస్ట్రిక్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ చత్రాది సూర్యచక్రవేణి అన్నారు. సోమవారం స్థానిక బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సెల్ఫ్ ప్రొటెక్షన్ సంబంధించిన అంశాలను, బాలికల రక్షణకు కల్పించిన చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలు యవ్వన కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. అనంతరం విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూర్య చక్ర వేణి, మండల విద్యాశాఖ అధికారి–2 కిరణ్ బాబు, పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం ఝాన్సీరాణి, ఐసీడీఎస్ పీవో మాధవి, సూపర్‌వైజర్ లీల కుమారి పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

జంగారెడ్డిగూడెం: వ్యభిచార గృహంపై జంగారెడ్డిగూడెం పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని రాజుల కాలనీలో వ్యభిచార గృహంపై నిర్వహించిన దాడుల్లో ఇద్దరు యువతులు, ఇద్దరు విటులు, నిర్వాహకురాలిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. దాడుల్లో సీఐ, ఎస్సైతోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధమరాజు గద్దెను సందర్శించిన ఐటీడీఏ పీవో



అధమరాజు గద్దెను సందర్శించి, పూజలు చేస్తున్న పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం: గిరిజన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామని ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామమైన మెరకగూడెంలో సోడెం వారి ఇలవేల్పు అయిన చిన అధమరాజు, పెద్ద అధమరాజుల గద్దెను పీవో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన సాంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు. గిరిజన మహిళలతో కలిసి పీవో సాంప్రదాయ నృత్యాలను చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, ఆచారాలకు ఒక ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనాధిగా గిరిజనుల సాంప్రదాయంగా నిర్వహిస్తున్న ఇలవేల్పుల జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. గిరిజన పండుగలకు, ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం కేఆర్‌పురం ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ సాంస్కృతిక విభాగం సౌజన్యంతో నిర్మించిన సోడెం వారి ఇలవేల్పుల (పేను) గద్దె భవనాన్ని పీవో ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోడెం గంగాదేవి, కేఆర్‌పురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కేవీఎస్ఎస్ కుమార్, డీవైఈవో కె. నీలయ్య, ఏఎంవో శిరమయ్య, పూజారి సోడెం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హెల్మెట్ ధారణ సురక్షిత ప్రయాణానికి సంకేతమని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతీ వాహనదారుడి కర్తవ్యమన్నారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించడం తప్పనిసరని తెలిపారు. వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయాలు తగలడం వలన మృతి చెందుతున్నారన్నారు. ప్రమాద తీవ్రత తగ్గించేందుకు హెల్మెట్‌లు, సీటు బెల్టులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఇటీవల కాలంలో వాహనదారులు సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఎక్కువ చేస్తున్నారని, ఇది చాలా ప్రమాదమన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లితండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేకపోతే భారీ జరిమానాలు, అవసరమైతే జైలు శిక్షను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై జె.రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎంను సద్వినియోగం చేసుకోండి



మృతుడి కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ రవితేజ

చింతలపూడి: బ్యాంకు ఖాతాదారులు ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలని రాఘవాపురం యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.రవితేజ అన్నారు. సోమవారం మండలంలోని రాఘవాపురం యూనియన్ బ్యాంక్ ఖాతాదారుడు బొప్పన నరేష్ రైలు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు బీమా సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ బ్యాంకు అకౌంట్ కలిగి, ఏటీఎం కార్డు వాడుతున్న ఖాతాదారులకు బీమా సౌకర్యం కలుగుతుందన్నారు. ఏటీఎం కార్డు వాడటం వలన బ్యాంకు ద్వారా వచ్చే ప్రమాద బీమా వంటివి పొందొచ్చని, అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమాను బ్యాంకులో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మృతుడు బొప్పన నరేష్ కుటుంబ సభ్యులకు రూ.2.50 లక్షల చెక్కును బీఎం రవితేజ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు నిత్యావసరాల అందజేత



బాధితులకు సహాయం అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండల ప్రధాన కేంద్రమైన కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ విభాగం చైర్మన్ బండి విజయభాస్కర్ పేర్కొన్నారు. ఇటీవల అంకాలగూడెం అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను సోమవారం పరామర్శించారు. మూడు దశాబ్ధాలుగా అగ్నిమాపక కేంద్రం కోసం కొయ్యలగూడెం మండల ప్రజలు పోరాడుతున్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. అగ్ని ప్రమాదాలు తరచూ సంభవిస్తుండడంతో ప్రజలు తీవ్రమైన నష్టాలను కష్టాలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్జీనియా పొగాకు రైతులకు అగ్నిమాపక కేంద్ర ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.30వేలు విలువైన నిత్యావసర సామాగ్రిని కొనుగోలు చేసి అందజేశారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కూనపోము రాజారత్నం, గౌతు సత్యేంద్ర, టి.కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



కుక్కునూరు ఆర్‌బీకేలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: గిరిజన రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై అందించే వరి విత్తనాలను సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో బాలాజీ మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 90 శాతం సబ్సిడీతో అందించే వరి విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. బీపీటీ 5204, ఎంటీయూ 1061, 1064, 7029 ఈ నాలుగు రకాల వరి విత్తనాలు పొజిషన్ చేశామన్నారు. రైతులు కేవలం 10 శాతం రేటు చెల్లించి వరి బస్తాలు తీసుకెళ్లొచ్చని, ఒక రైతుకు గరిష్ఠంగా 5 బస్తాలు ఇస్తామన్నారు. బీపీటీ 5204 రకం 25 కేజీల బస్తా రేటు రూ.105, ఎంటీయూ 1061, 1064, 7029 రకాలు 30 కేజీల బస్తా రేటు రూ.120కు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విత్తన ఉత్పత్తి కార్యక్రమంలో 50 శాతం రాయితీతో ఎంటీయూ 1061 రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. వీటికి తోడుగా లబ్ధి పొందిన ప్రతీ రైతు ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఆయన సూచించారు. అదే విధంగా గిరిజన రైతులు మాత్రమే పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్‌ల నకలు, ఫోన్ నంబర్ తీసుకొని సంబంధిత ఆర్‌బీకేలకు వెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా

టి.నరసాపురం: దోమల నివారణకు డ్రైనేజీ వ్యవస్థ పటిష్ట పరచాలని టి.నరసాపురం సామాజిక కార్యకర్త, సింగరేణి కార్మిక నాయకులు ఎస్‌డీ నాసర్ పాషా కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావులకు వినతిపత్రం అందజేశారు. నాసర్‌పాషా మాట్లాడుతూ మండలంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని, వర్షాకాలంలో ఎర్ర చెరువు ముంపు నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. టి.నరసాపురంలో అసంపూర్తిగా మిగిలిన మురుగు నీటి కాలువలను పూర్తి చేయాలన్నారు. చింతలపూడి-టి.నరసాపురం ప్రధాన రహదారి, టి.నరసాపురం-బంధంచర్ల రోడ్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కొత్త ప్రభుత్వంలో అధికారులు దీనిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు, వేద పండితులు సత్య, కిరణ్‌లు చండీహోమం నిర్వహించారు. ఈ హోమానికి ఉభయ దారులుగా జంగారెడ్డిగూడేనికి చెందిన దుగ్గిరాల వెంకట గోపాలరావు, మధు చంద్రశేఖర్, కొప్పుల వెంకట సీతమహాలక్ష్మి దంపతులు వ్యవహించారు. అనంతరం దూసనపూడి ఏడుకొండలు పద్మావతి దంపతులు వారి ఆర్థిక సహాయంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్ ఉపాధ్యక్షుడు వందనపు అప్పలరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యర్రం ఉదయ్ కుమార్, సభ్యులు జల్లిపల్లి శివకృష్ణ, కర్పూరం తుకారం, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) / (మెట్రో) : జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణికి ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా, కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు సోమవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో రబీ ధాన్యం అమ్మిన రైతులకు రూ.240 కోట్లు బకాయి విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపునకు జారీ చేసిన జీఓ–22ను రద్దు చేయాలని కోరారు. పాడి రైతులకు లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుకు అసెంబ్లీలో చట్టం చేయాలని, సమగ్ర భూ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసి ఖచ్చితమైన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని, పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని, హైవే నిర్మాణంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, సీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్స్ ఇప్పించాలని కోరారు.

రాజీనామా చేసి వెళ్లిపోండి

ఎమ్మెల్యే రోషన్‌కుమార్ హెచ్చరిక



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

లింగపాలెం: బాధ్యతల పట్ల చిత్తశుద్ధి లేకపోతే రాజీనామా చేసి వెళ్లిపోవాలని అధికారులను చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ హెచ్చరించారు. లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించేందుకు అందరం కలిసి కట్టుగా పని చేద్దామన్నారు. సేవలు అందించే విషయంలో ఏ అధికారైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చిన సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గరిమల చలపతిరావు, నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం

పొంగి పొర్లిన కొండవాగులు



జీలుగుమిల్లి-కామయ్యపాలెం రహదారిపై వాగు పొంగుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని మండలాల్లో సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో కొండవాగులు పొంగిపొర్లాయి. గుబ్బల మంగమ్మ గుడి రహదారి వెంబడి కాల్వలు, కేఆర్‌పురం వాగు, చింతకొండ వాగు, డోలుగండి వాగులు పొంగిపొర్లాయి. అదే విధంగా జీలుగుమిల్లి నుంచి కామయ్యపాలెం వెళ్లే రహదారిలో వాగు పొంగి పొర్లడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గంట తర్వాత వాగులో ఉధృతి తగ్గి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆర్డీవో అద్దయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టి.నరసాపురం మండలం మక్కినవారిగూడేనికి చెందిన దొంతు లక్ష్మీనారాయణ తన భూమిని ఆక్రమించారని, అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన తేలు అమ్మాజీ తన కుమార్తె భర్త మోసపూరితంగా తన ఇంటిని వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఇంటిపై రూ.9 లక్షలు అప్పు చేసి తీర్చలేదని, తమను ఇంటి నుంచి గెంటి వేశారని, న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. తోట రత్నకుమార్ కామవరపుకోట మండలం వీపీ నూతనం గ్రామంలో తనకున్న 2.82 ఎకరాల భూమిని ఆక్రమించారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జీలుగుమిల్లి మండలం చంద్రమ్మ కాలనీకి చెందిన వి.సీతారత్నం ఇంటి స్థలం మంజూరు చేయించాలని కోరుతూ దరఖాస్తు చేశారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో నిలిచిన వేలం

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ ఆశీల వేలం నిలిచిపోయింది. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించాల్సిన వేలం ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి తెలిపారు. వారపు సంత, రోజువారీ మార్కెట్‌లకు ప్రతి సంవత్సరం ఏప్రియల్ ఒకటి నుంచి మార్చి 31 వరకు వేలం నిర్వహిస్తుంటారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా వేలం పాటలను దక్కించుకున్న వ్యక్తులు పంచాయతీకి బాకీ సొమ్ములు కట్టకుండా ఎగవేతకు పాల్పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. గత ఏప్రియల్‌లోనే వేలం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎన్నికల నేపథ్యంలో మూడు నెలల వాయిదా అనంతరం జూన్‌లో నిర్వహిస్తున్నారు. వేలంలో పాల్గొనడానికి 20 మంది వరకు పంచాయతీ కార్యాలయానికి చేరుకొని ఒక్కొక్కరూ రూ.లక్ష చొప్పున డిపాజిట్ కట్టారు.

మహిళపై దాడి.. కేసు నమోదు



దాడికి గురైన మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రాజేష్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని మంగిశెట్టిగూడెంలో ఒక మహిళపై దాడికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగోపు చిరంజీవి, శివ పార్వతి, గోపిశెట్టి కనకదుర్గల మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతోన్నాయి. కనకదుర్గ ఇంటి స్థలం విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో చిరంజీవి దంపతులు రాయితో కనకదుర్గపై దాడికి పాల్పడి గాయపర్చారు. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్, ఎస్సై జ్యోతి బాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని కనకదుర్గను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేష్ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



రోగులను పరామర్శించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చింతలపూడి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్యులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులను కలుసుకొని వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెరిగేలా చూడాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది, మందుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రిని పరిశీలించారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రసూల్, మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, బోడా అనీష్, తాటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.